# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 100 24-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## రాష్ట్రానికి ఆదాయాన్నిచ్చే నగరంగా అమరావతి అభివృద్ధి

### ల్యాండ్ పూలింగ్ రైతులకు కౌలు పెంచుతూ కీలక నిర్ణయం

- వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం
- ప్రతిష్టాత్మక విద్యా, ప్రభుత్వ సంస్థలకు భూముల కేటాయింపు
- 2027 నుంచి బిట్స్ పిలానీలో అడ్మిషన్లు ప్రారంభం
- అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్ పనులపై సీఎంతో సమీక్ష
- క్వాంటం, ఏఐ విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి
- 2027 నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని నిర్ణయం
- క్యాంపస్ నిర్మాణం, విస్తరణ కోసం రూ.250 కోట్ల వ్యయం
- మొత్తం 10 వేల మంది విద్యార్థులకు విద్యావకాశాలు

అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది. వారి జీవనోపాధికి భరోసా కల్పిస్తూ వార్షిక కౌలును గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్ట భూములకు ఎకరాకు ఇచ్చే కౌలును రూ.40 వేలకు, జరీబు భూములకు రూ.60 వేలకు పెంచింది. అంతేకాకుండా, రాబోయే పదేళ్లపాటు ప్రతీ ఏటా మెట్ట భూములకు రూ.3 వేలు, జరీబు భూములకు రూ.5 వేల చొప్పున కౌలు పెంచేందుకు కూడా ఆమోదం తెలిపింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 60వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం రాజధాని రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సమావేశంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు, కొత్త పనులకు శ్రీకారం చుట్టేందుకు వేల కోట్ల రూపాయల విలువైన ప్రతిపాదనలకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదముద్ర వేసింది. ఇందులో





## భగ్గుమంటున్న ఏపీ..


- పలుచోట్ల 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోని 151 మండలాలకు ఈదురుగాలుల హెచ్చరిక
- 62 మండలాల్లో తీవ్రమైన, 89 మండలాల్లో సాధారణ ఈదురుగాలుల సూచన
- పలు జిల్లాల్లో 45 డిగ్రీలు దాటి కొనసాగుతున్న ఎండల తీవ్రత
- శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో అత్యధికంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత



## భారత్ గొప్ప దేశం..

- అంతలోనే మాటమార్చిన ట్రంప్!
- 'నరక కూపం' వివాదం తర్వాత భారత్‌పై ట్రంప్ ప్రశంసలు
- భారత్ గొప్ప దేశమని, తనకు మంచి స్నేహితుడు ఉన్నాడని వ్యాఖ్య
- అమెరికన్ రేడియో హోస్ట్ వ్యాఖ్యలను ట్రంప్ రీపోస్ట్ చేయడంతో దుమారం

2లో



## పోటెత్తిన ఓటింగ్

- బెంగాల్ తొలి విడతలో 92.72%.. తమిళనాడులో 85.14%
- రెండు రాష్ట్రాల్లో సరికొత్త రికార్డు సృష్టించిన ఓటర్లు
- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు
- ఎస్ఐఆర్ తర్వాత తొలి ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్న జనం
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు, సినీ నటులు

# ఆర్టీసీ సమ్మెలో విషాదం




- సమ్మెలో భాగంగా ఆత్మహత్యాయత్నం చేసిన శంకర్‌గౌడ్
- హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూత
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఆత్మార్పణ
- కార్మికులు ఆందోళన విరమించాలని ప్రభుత్వం విజ్ఞప్తి
- నేడు కార్మిక సంఘాలతో ప్రభుత్వ చర్చలు

తెలంగాణ ఆర్టీసీ సమ్మెలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నర్సంపేట డిపో డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ (55) మృతి చెందారు. 80 శాతం కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని అపోలో డీఆర్‌డీవో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కొనసాగింది. ఈ క్రమంలో వరంగల్ జిల్లా నర్సంపేట బస్టాండ్ ఎదుట శంకర్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. తోటి కార్మికులు, పోలీసులు వెంటనే మంటలు ఆర్పినప్పటికీ తీవ్ర గాయాలయ్యాయి. తొలుత వరంగల్ ఎంజీఎంకు, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

**ఉద్రిక్తంగా మారిన సమ్మె**

శంకర్‌గౌడ్ మరణంతో రాష్ట్రవ్యాప్త ఆర్టీసీ సమ్మెలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇదే తరహాలో నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో మరో ఇద్దరు డ్రైవర్లు కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కార్మికుల్లో నెలకొన్న తీవ్ర ఆందోళనను స్పష్టం చేస్తోంది. మరోవైపు, రెండో

2లో



## మే 4న మిఠాయిలు, ఝాల్‌మురీ తినిపిస్తాం

- అది తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 'ఎక్స్‌పైరీ డేట్'
- పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం
- తొలి విడతలో భారీ ఓటింగ్ ప్రజల ఆకాంక్షకు నిదర్శనం
- మార్పునకు అనుకూలంగా అఖండమైన తీర్పు రాబోతోంది
- బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- ఎన్నికల్లో హింస తగ్గినందుకు ఎన్నికల సంఘానికి అభినందనలు



## ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు

- జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన ఒంటిమిట్ట అర్చకులు..
- మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి వేదాశీర్వచనం అందించడమే కారణం
- ఆలయ నిబంధనలను ఉల్లంఘించారని అర్చకులపై టీటీడీ ఆగ్రహం
- రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం

2లో




## 100 రోజుల్లో ఉద్యోగులకు బిల్లులు

- ప్రణాళిక రూపకల్పన బాధ్యత మంత్రివర్గ ఉప సంఘానికి
- కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి
- రూ.8 వేల కోట్లకు చేరిన బకాయిలతో ఇక్కట్లలో రిటైర్డ్ ఉద్యోగులు
- ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి అవసరమైన నిధుల సర్దుబాటు
- వచ్చే నెల 4న జరిగే తదుపరి కేబినెట్‌లో చెల్లింపులపై నిర్ణయం

## ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చెందిన ముగ్గురు అర్చకులపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా, పులివెందులలో మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి ఆయనకు వేదాశీర్వచనం అందించినందుకు గాను వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. టీటీడీ పరిధిలో ఉన్న ఈ ఆలయంలో పనిచేసే అర్చకులు ప్రొటోకాల్‌ను అతిక్రమించడంపై యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. వ్యక్తిగత హోదాలో రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లి ఆలయ మర్యాదలను పాటించకపోవడం సరికాదని భావించింది. ఈ నేపథ్యంలోనే సదరు అర్చకులపై చర్యలకు ఉపక్రమించింది. అర్చకులకు జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లో రెండు రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని టీటీడీ స్పష్టం చేసింది. వారు ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆలయ పవిత్రత, నియమ నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని టీటీడీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ నోటీసులపై అర్చకుల నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. వారి వివరణ అందిన తర్వాత టీటీడీ తదుపరి చర్యలు తీసుకోనుంది.

## భారత్ గొప్ప దేశం..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను 'గొప్ప దేశం' అని అభివర్ణిస్తూ, తనకు అక్కడ ఒక 'చాలా మంచి స్నేహితుడు (మోదీ)' ఉన్నారని ప్రశంసించారు. అయితే, భారత్‌ను 'నరక కూపం' (హెల్ హోల్) అంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలున్న పోడ్‌కాస్ట్‌ను రీపోస్ట్ చేసిన తర్వాత, ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ఇటీవల అమెరికన్ రేడియో హోస్ట్ మైఖేల్ సేవేజ్ తన పాడ్‌కాస్ట్‌లో భారత్, చైనాలను 'నరకకూపాలు'గా అభివర్ణించారు. అమెరికాలో జన్మస్థలం ఆధారంగా పౌరసత్వం (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, ఆయా దేశాల మహిళలు తొమ్మిదో నెల గర్భంతో అమెరికాకు వచ్చి పిల్లల్ని కంటున్నారని, తద్వారా సులువుగా పౌరసత్వం పొందుతున్నారని ఆయన ఆరోపించారు. భారతీయులను 'ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లు'గా ఆయన వ్యాఖ్యానించారు. ఈ పాడ్‌కాస్ట్ వీడియోను, ట్రాన్‌స్క్రిప్ట్‌ను ట్రంప్ తన సోషల్ మీడియాలో రీపోస్ట్ చేయడంతో పెద్ద దుమారం రేగింది. ఈ వివాదం నేపథ్యంలో ట్రంప్ భారత్‌పై తన వైఖరిని స్పష్టం చేసే ప్రయత్నం చేశారు. 'భారత్ ఒక గొప్ప దేశం. ఆ దేశ నాయకత్వంలో నాకు ఒక మంచి స్నేహితుడు ఉన్నారు' అని ట్రంప్ అన్నట్లు న్యూఢిల్లీలోని అమెరికా ఎంబసీ ప్రతినిధి క్రిస్టోఫర్ ఎల్మ్స్ తెలిపారు. ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ స్పందిస్తూ, "మేము కొన్ని నివేదికలు చూశాం, అంతకు మించి మాట్లాడడానికేమీలే దు" అని క్లుప్తంగా బదులిచ్చారు. అమెరికాలో వలస విధానాలు, బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌పై తీవ్రంగా చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మొత్తంమీద, ఈ వివాదం ద్వారా చెలరేగిన దుమారాన్ని చల్లార్చేందుకే ట్రంప్ భారత్‌తో తన స్నేహాన్ని మరోసారి గుర్తుచేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## మే 4న మిఠాయిలు, ఝాల్‌ముడీ తినిపిస్తాం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి మే 4వ తేదీయే 'ఎక్స్‌పైరీ డేట్' అని ప్రధాని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. రాష్ట్రంలో 15 ఏళ్ల సిండికేట్ వ్యవస్థ, మహా జంగిల్‌రాజ్ అంతమైపోతుందని స్పష్టంచేశారు. ప్రధాని మోదీ గురువారం బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రెండో విడత అసెంబ్లీ ఎన్నికలు జరిగే మథురాపూర్, కృష్ణానగర్ నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో ప్రసంగించారు. తొలి విడత ఎన్నికల్లో భారీగా ఓటింగ్ నమోదు కావడం తృణమూల్ కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఓటర్లకు అభినందనలు తెలియజేశారు. ఈ ఓటింగ్‌ను 'మార్పు కోసం ఇచ్చిన తీర్పు'గా అభివర్ణించారు. బెంగాల్ ఓటర్ల నిర్ణయం మేరకు మార్పునకు అనుకూలంగా అఖండమైన తీర్పు రాబోతోందని అన్నారు. అధికార పార్టీ సృష్టించిన భయాన్ని బీజేపీ ఇస్తున్న భరోసా చిత్తుచిత్తుగా ఓడించబోతోందని స్పష్టంచేశారు. బీజేపీ ప్రభంజనం సృష్టించడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. దేశంలో భారీ ఓటింగ్ నమోదైన ప్రతిచోటా బీజేపీ విజయాలు సాధిస్తోందని వెల్లడించారు. వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక విజయోత్సవాలు నిర్వహిస్తామని, బెంగాల్ ప్రజలకు మిఠాయిలతోపాటు ఝాల్‌ముడీ పంపిణీ చేస్తామని మోదీ ప్రకటించారు. బెంగాల్‌లో తాను ఝాల్‌ముడీ రుచిని ఆస్వాదించడం కొందరికి పిడుగుపాటు లాంటి షాక్ ఇచ్చిందన్నారు. తాను ఝాల్‌ముడీ రుచి చూస్తే తృణమూల్ కాంగ్రెస్ నాయకులకు మిరపకాయల ఘాటు తగులుతోందని ఎద్దేవా చేశారు. తొలి దశ ఎన్నికల సందర్భంగా హింసాకాండను కనిష్ట స్థాయిలో ఉంచినందుకు ఎన్నికల సంఘాన్ని అభినందించారు. 50 ఏళ్ల బెంగాల్ ఎన్నికల చరిత్రలో హింసాత్మక ఘటనలు కనిష్ట స్థాయికి తగ్గడం ఇదే మొదటిసారి అని వెల్లడించారు. "బెంగాల్‌లో లంచాలు లేకుండా పనులు జరిగే రంగం ఒక్కటి కూడా లేదు. టీఎంసీ సిండికేట్లు, వారి మధ్యవర్తులు కట్ మనీ తీసుకోని రంగమే లేదు. 15 ఏళ్ల సిండికేట్ వ్యవస్థ, మహా జంగిల్‌రాజ్‌కు కాలం చెల్లిపోయింది. ఆ గడువు మే 4వ తేదీ. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసినందుకు మమతా బెనర్జీ ప్రభుత్వం బాధ్యత వహించాలి. వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో వంతెనలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. చివరకు ప్రజలను దగా చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు బెంగాల్‌లో అమలు కాకుండా అడ్డుకున్నారు. అభివృద్ధి పనుల కోసం కేంద్రమిచ్చిన నిధులను స్వాహా చేశారు.

## తెలంగాణ రాష్ట్ర పండుగగా వాసవీ మాత జయంతి...

2తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీ వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించింది. ఇకపై ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ లాంఛనాలతో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న వాసవీ జయంతి రానుండటంతో, ఆ రోజున ఉత్సవాలు జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు బుధవారం 67ను జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో వాసవీ మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖకు నోడల్ ఏజెన్సీగా అప్పగించారు. వేడుకలకు అవసరమైన నిధులను ఆ శాఖ బడ్జెట్ నుంచే కేటాయించాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో వాసవీ మాత జయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా జరగనున్నాయి.

# 100 రోజుల్లో 'రిటైర్డ్' బకాయిలు!

హైదరాబాద్: రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన రూ.8 వేల కోట్ల పైచిలుకు పదవీ విరమణ ప్రయోజనాలను వచ్చే 100 రోజుల్లోగా ఎలా చెల్లించాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వనరుల సమీకరణపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి ఈ బాధ్యతను అప్పగించింది. వచ్చే నెల 4న జరగనున్న తదుపరి మంత్రివర్గ సమావేశంలో మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానించింది. గురువారం సచివాలయంలో సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశమైంది. రిటైర్డ్ ఉద్యోగులకు రూ.8 వేల కోట్లు, ఇన్ సర్వీస్ ఉద్యోగులకు మరో రూ.6,200 కోట్లు కలిపి మొత్తం రూ.14,200 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు నివేదించారు. దీంతో పాటు ఇతర అంశాలు చర్చించిన మంత్రివర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. భేటీ అనంతరం రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి..సహచర మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి వివరాలు వెల్లడించారు. 'ఉమ్మడి ఏపీలో ఉద్యోగులు రిటైరైన కొన్ని నెలలకే పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించే వారు. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లు పాలించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలను మిగిల్చిపోయింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది రిటైర్డ్ ఉద్యోగులకు బిల్లులు చెల్లించలేకపోయాం. కానీ గత 14 నెలలుగా ప్రతి నెలా రూ.750 కోట్ల నుంచి రూ.800 కోట్లను చెల్లించుకుంటూ వస్తున్నాం. అయితే రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసులు, సచివాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతుండటంపై మంత్రివర్గం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే రెగ్యులర్ ఉద్యోగుల బకాయిలను సైతం సత్వరమే చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలనే ఆలోచన చేసింది.

### ప్రజా ప్రతినిధుల జీతాల నుంచి 50% కోత

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా బకాయిలను వెంటనే చెల్లించలేని పరిస్థితి ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సీఎం, మంత్రులతో పాటు ప్రజా ప్రతినిధుల జీతాల నుంచి 50 శాతం నిధులను కోత పెట్టి రిటైర్డ్ ఉద్యోగుల బిల్లుల చెల్లింపులకు వినియోగించాలని తీర్మానించింది. బకాయిల చెల్లింపులపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి సూచనలు చేయాలని వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘానికి కేబినెట్ సూచించింది..' అని పొంగులేటి తెలిపారు. సీఎం రేవంత్‌తో పాటు త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలిసి కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకతలపై విచారణ చేపట్టాలని కోరతామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్, ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలను ఇప్పటికే సీబీఐకు పంపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరి 9 నెలలు గడుస్తున్నా స్పందన లేదు. మళ్లీ త్వరలోనే ఈ నివేదికలను సీబీఐ డైరెక్టర్‌కు కూడా అందజేస్తాం..' అని అన్నారు. కేవలం బరాజ్‌లపై మాత్రమే విచారణ కోరుతున్నామంటూ మంత్రి ఓ ప్రశ్నకు బదులిచ్చారు. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సీబీఐ విచారణ చేస్తే చేయమనండి అని అన్నారు. కాళేశ్వరంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై తాజాగా రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పు సారాంశాన్ని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి మంత్రివర్గానికి వివరించినట్టు ఉత్తమ్ తెలిపారు. ఘోష్ కమిషన్ నియామకాన్ని, కమిషన్ ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పు బట్టలేదని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, ఎస్కే జోషి, స్మిత సబర్వాల్ తమ పిటిషన్లలో చేసిన ఆరోపణలతో న్యాయస్థానం ఏకీభవించలేదని చెప్పారు.

## పోటెత్తిన ఓటింగ్

కోల్‌కతా/చెన్నై: ఓటర్లలో వెల్లువెత్తిన చైతన్యానికి సంకేతంగా పశ్చిమ బెంగాల్ తొలి విడత అసెంబ్లీ ఎన్నికల్లో, ఒకే విడతలో జరిగిన తమిళనాడు ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైంది. గురువారం 152 స్థానాలకు జరిగిన బెంగాల్ ఎన్నికల్లో 92.72 శాతం, మొత్తం 234 స్థానాలకు జరిగిన తమిళనాడు ఎన్నికల్లో 85.14 శాతం ఓటింగ్ నమోదు కావడం విశేషం. రెండు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే ద్వారా అర్హత లేని లక్షలాది ఓట్లను తొలగించిన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో రికార్డుస్థాయిలో ఓటింగ్ నమోదవడం గమనార్హం. శుక్రవారం ఉదయం కల్లా తుది గణాంకాలు రావొచ్చు. బెంగాల్‌లో అక్కడక్కడా హింసాకాండ చోటుచేసుకోవడం మినహా తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కనిష్ట స్థాయిలో హింస జరగడం బెంగాల్ ఎన్నిక చరిత్రలో ఇదే మొదటిసారి అని విశ్లేషకులు చెబుతున్నారు. తమిళనాడులోనూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకపోవడంతో ఎన్నికల సంఘం ఊపిరి పీల్చుకుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో పాలుపంచుకోవడానికి, దేశ పౌరులుగా తమ విధిని నిర్వర్తించడానికి ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరి ఉత్సాహంగా ఓటువేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. సమయం ముగిసినా పోలింగ్ కేంద్రాల ఎదుట రద్దీ తగ్గలేదు. వరుసలో నిల్చున్నవారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ నమోదు కావడం ఇదే మొదటిసారి. ఈ నెల 9న జరిగిన అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల్లోనూ మునుపెన్నడూ లేని రీతిలో అత్యధిక ఓటింగ్ నమోదైంది. అస్సాంలో 85.38 శాతం, పుదుచ్చేరిలో 89.83 శాతం నమోదయ్యింది. బెంగాల్, తమిళనాడులో ఇప్పటిదాకా 2011 నాటి ఎన్నికల ఓటింగే అత్యధికం. అప్పట్లో బెంగాల్‌లో 84.72 శాతం, తమిళనాడులో 78.29 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆ రికార్డును ఈసారి ఓటర్లు తిరగరాశారు. రెండు రాష్ట్రాల్లో పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. తమిళనాడులో పురుషులు 83.57 శాతం మంది ఓటువేయగా, మహిళలు 85.76 శాతం మంది ఓటువేశారు. బెంగాల్‌లో పురుషులు 90.92 శాతం, మహిళలు 92.69 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్‌లో సరికొత్త రికార్డు సృష్టించిన రెండు రాష్ట్రాల ఓటర్లకు సెల్యూట్ చేస్తున్నామని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అన్నారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ద్వారా 91 లక్షల ఓట్లను తొలగించారు. ఈ నేపథ్యంలో అర్హులైన ఓటర్లలో 91.78 శాతం మంది ఓటు వేశారు. బెంగాల్‌లో తొలి విడత ఎన్నికల సందర్భంగా హింసాకాండ చోటుచేసుకుంది. అధికార టీఎంసీ, విపక్ష బీజేపీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. ఉద్రిక్తత పరిస్థితులను సైతం లెక్కచేయకుండా జనం భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. హింసాత్మక ఘటనలు ఓటర్ల ఉత్సాహాన్ని తగ్గించలేకపోయాయి. 2021లో 82.30 శాతం ఓటింగ్ నమోదు కాగా, గురువారం 92 శాతం దాటేసింది.

## ఆర్టీసీ సమ్మెలో విషాదం


రోజైన గురువారం కూడా సమ్మె కొనసాగింది. ప్రభుత్వం తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో, పోలీసు బందోబస్తు మధ్య సుమారు 45 శాతం బస్సులను నడిపినట్లు అధికారులు తెలిపారు. అయితే, బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రైవేటు వాహనదారులు ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడ్డారు. ఈ వరుస పరిణామాలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. కార్మికులు ఆత్మహత్యల వంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో సహా పలువురు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం కార్మిక సంఘాల నాయకులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రుల కమిటీ చర్చలు జరపనుంది. శంకర్‌గౌడ్ మృతికి ప్రభుత్వ వైఖరే కారణమని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తమ 32 డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె విరమించేది లేదని, నిరసనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆర్టీసీ జేఏసీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం–కార్మిక సంఘాల మధ్య జరగబోయే చర్చలు కీలకం కానున్నాయి.

## భగ్గుమంటున్న ఏపీ..

ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఓవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాష్ట్రంలోని 62 మండలాల్లో తీవ్రమైన ఈదురుగాలులు, మరో 89 మండలాల్లో సాధారణ ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. దీనికి అదనంగా మరో 7 మండలాల్లో తీవ్రమైన, 31 మండలాల్లో సాధారణ గాలులు కూడా నమోదయ్యే సూచనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఆశ్రయం పొందవద్దని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. గురువారం పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో అత్యధికంగా 45.4 డిగ్రీల సెల్సియస్, కడపలో 45.1, మన్యం జిల్లా సాలూరులో 45.1, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## రాష్ట్రానికి ఆదాయాన్నిచ్చే నగరంగా అమరావతి అభివృద్ధి

భాగంగా, అమరావతి క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్ల నిర్మాణం కోసం రూ.1208.41 కోట్లకు పాలనానుమతి ఇచ్చారు. సచివాలయం, జీఏడీ, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో అత్యంత కీలకమైన ఫాసేడ్, గ్లేజింగ్, క్లాడింగ్ పనుల కోసం రూ.2540 కోట్లు, ఏపీ శాసనసభ భవనంలో వివిధ సివిల్ పనుల కోసం రూ.798 కోట్ల వ్యయానికి అథారిటీ ఆమోదం తెలిపింది. వీటితో పాటు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్పీఎస్) జోన్ 11లో రోడ్లు, డ్రైన్లు, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల పనులకు, రాజధానిలో 220 కేవీ విద్యుత్ లైన్ల రీరూటింగ్ పనులకు కూడా అనుమతులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా, రాష్ట్రానికి ఆదాయాన్ని ఆర్జించి పెట్టే రెవెన్యూ ఎర్నింగ్ సిటీగా అభివృద్ధి చేయాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాజధానిలో చేపట్టే ప్రతి నిర్మాణం తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉండాలని, అదే సమయంలో ప్రపంచస్థాయి ఐకానిక్ డిజైన్లతో అద్భుతమైన అనుభూతిని కలిగించాలని సూచించారు. అమరావతిని హరిత, నీలి నగరంగా (గ్రీన్ అండ్ బ్లూ సిటీ), నివాసయోగ్యమైన నగరంగా (లివబుల్ సిటీ) తీర్చిదిద్దుతున్నామని పునరుద్ఘాటించారు. విజయవాడను అమరావతితో అనుసంధానించేలా కృష్ణా నదిపై నిర్మించే బ్రిడ్జిని ఒక ఐకానిక్ సింబల్‌గా నిర్మించాలని



ఆదేశించారు. అమరావతిని రాష్ట్రానికి ఒక గ్రోత్ ఇంజన్‌గా మార్చాలని, పెట్టుబడులకు, ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎం ఆకాంక్షించారు. ఇందులో భాగంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు స్థలాలు కేటాయించాలని, హైరైజ్, ఐకానిక్ భవనాల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. నీరు, విద్యుత్, గ్యాస్‌తో పాటు డిస్ట్రిక్ట్ కూలింగ్ వ్యవస్థను కూడా డక్ట్‌ల ద్వారా సరఫరా చేసే ఆధునిక మౌలిక వసతులపై దృష్టి పెట్టాలన్నారు. రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఇదే సమావేశంలో సెబీ, స్వామినారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్, డీఏవీ పాఠశాల, అగ్నిమాపక శాఖ, ఆప్కాబ్ వంటి పలు సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులకు అథారిటీ ఆమోదం తెలిపింది. అంతకుముందు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థ బిట్స్ పిలానీ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై అమరావతి క్యాంపస్ నిర్మాణ పురోగతిని వివరించారు. రూ.250 కోట్ల వ్యయంతో మూడు దశల్లో క్యాంపస్ నిర్మిస్తున్నామని, 2027 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ క్యాంపస్‌లో క్వాంటం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు, మొత్తం 10 వేల మంది విద్యార్థులకు విద్యనందించేలా నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, క్వాంటం టెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిణామాలతో అమరావతి నిర్మాణం తిరిగి పట్టాలెక్కిందని, రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని స్పష్టమవుతోంది.

# వాసవి జయంతి రాష్ట్ర పండుగగా ప్రకటించడం శుభపరిణామం

- మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పల రమేష్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ఐలయ్యకు కృతజ్ఞతలు



**తొలివెలుగు, రాజాపేట:** ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల రాజాపేట మండల ఆర్యవైశ్య సంఘం హర్షం వ్యక్తం చేసింది. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు ఉప్పల రమేష్ మాట్లాడారు. ప్రతి ఏటా వైశాఖ శుక్లపక్ష దశమి రోజున నిర్వహించే వాసవీ మాత జయంతి వేడుకలను ఇకపై ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం శుభపరిణామమన్నారు. ఆర్యవైశ్యుల చిరకాల వాంఛను మన్నించి, ఈ నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, ఇందుకు సహకరించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా పథంలో నడిచే ఆర్యవైశ్యులకు ఈ నిర్ణయం ఎంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. లోక కల్యాణం కోసం అగ్నిప్రవేశం చేసిన వాసవి మాత ఆశీస్సులు రాష్ట్ర ప్రభుత్వంపై, ప్రజలపై నిండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నిర్ణయం పట్ల మండలంలోని ఆర్యవైశ్య ప్రముఖులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్ల 'గ్రేడింగ్' దందా.. రైతు బలి!

- రైస్ మిల్లర్లు, అధికారుల మధ్య భేదాభిప్రాయాలు
- గిట్టుబాటు ధర రాక అన్నదాతల ఆవేదన
- ధాన్యం కేంద్రాలను కోసం పరిశీలించిన మాజీ మార్కెట్ డైరెక్టర్ నరసింహులు



**తొలివెలుగు, రాజాపేట :** ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు వచ్చిన రైతులకు ధాన్యం గ్రేడింగ్ వ్యవహారం శాపంగా మారింది. వ్యవసాయ శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు ధ్వజమెత్తారు. గురువారం మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి, రైతులతో నేరుగా మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ధాన్యాన్ని పరిశీలించి 'ఏ' గ్రేడ్ అని సర్టిఫై చేసిన తర్వాతే కాంటా వేసి మిల్లులకు తరలిస్తున్నారని గుర్తు చేశారు. తీరా మిల్లుకు వెళ్లిన తర్వాత మిల్లర్లు ఆ ధాన్యాన్ని 'బి' గ్రేడ్ కింద లెక్కగడతామని కొర్రీలు పెట్టడం విచారకరమన్నారు. మిల్లర్లు కేంద్రాల వద్దకు వచ్చి ధాన్యాన్ని 'బి' గ్రేడ్ కిందనే సర్టిఫై చేయాలని ఇన్చార్జిలపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు మొదలయ్యాయని, కేసీఆర్ హయాంలో రైతాంగానికి స్వర్ణయుగం ఉండేదని వ్యాఖ్యానించారు. రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

# కార్పొరేట్ స్టైల్లో.. సర్కారీ స్కూల్ ప్రచారం!

- రాజాపేట పీఎంశ్రీ బడిపై 'బడిబాట' జోరు
- ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల నమోదు
- ఆకట్టుకుంటున్న ప్రచార బ్రోచర్లు






**తొలివెలుగు, రాజాపేట :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేటుకు ఏమాత్రం తీసిపోని విధంగా మౌలిక వసతులు ఉన్నాయని చాటిచెప్పేందుకు రాజాపేట పీఎంశ్రీ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం నడుం బిగించింది. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు రాజు నేతృత్వంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా, పాఠశాల ప్రత్యేకతలను వివరిస్తూ రూపొందించిన ప్రచార బ్రోచర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజు మాట్లాడుతూ.. జిల్లాలోనే తమ పాఠశాల హాజరు శాతాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. పాఠశాలలో అందిస్తున్న ఉచిత విద్య, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, ప్రత్యేక స్టడీ మెటీరియల్‌తో పాటు పదో తరగతి ఫలితాల్లో సాధించిన 100% ఉత్తీర్ణతను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు, విద్యా రంగాల్లో విద్యార్థులు సాధించిన విజయాలను బ్రోచర్‌లో ముద్రించి ప్రచారం చేయడం వల్ల తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతోందన్నారు. ప్రచార బ్రోచర్ రూపకల్పనకు ఆర్థికంగా సహకరించిన ఉపాధ్యాయురాలు అరుణ, సత్య ఫణీంద్ర దంపతులను ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది. ప్రైవేటు పాఠశాలల ఆకర్షణలకు లోనుకాకుండా, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్న ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు.



# ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి

- లింగోజిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో కన్నులపండువగా గ్రాడ్యుయేషన్ వేడుకలు
- ఆడిపాడిన విద్యార్థులు.. మురిసిపోయిన కన్నవాళ్లు
- భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్న హెచ్ఎం శ్రీనివాస్
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల ప్రదానం
- లింగోజిగూడెంలో ఘనంగా ముగిసిన వేడుకలు



**తొలివెలుగు, చౌటుప్పల్ :** విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుని, పట్టుదలతో చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) ప్రధానోపాధ్యాయులు కూరెళ్ల శ్రీనివాస్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగోజిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే (వీడ్కోలు, పురోగతి నివేదికల ప్రదానోత్సవం) కార్యక్రమాన్ని గురువారం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి వెళ్తున్న విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసంలో మరింతగా రాణించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం, విద్యార్థుల విద్యా ప్రగతికి అద్దం పట్టే ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మైకు పట్టుకుని గురువులతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. తమ విజయాల వెనుక ఉపాధ్యాయుల అహర్నిశల శ్రమ దాగి ఉందని కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తమ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందానికి తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మాధవరెడ్డి, అరుణ, పురుషోత్తమాచారి, విజయలక్ష్మి, రమేష్ రెడ్డి, బండి అనిల్ కుమార్ రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఆ పార్టీ హయాంలోనే మహిళలపై అత్యధిక దాడులు
- మహిళా బిల్లుపై కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టిన బీజేపీ నేత
- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి చంద్ర



**తొలివెలుగు, రాజాపేట :** కాంగ్రెస్ పార్టీలో కేవలం గాంధీ కుటుంబానికి చెందిన మహిళలకు మాత్రమే గౌరవం దక్కుతుందని, ఇతర మహిళలకు ఆ పార్టీలో ఎలాంటి ప్రాధాన్యతా లేదని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి చంద్ర విమర్శించారు. గురువారం రాజాపేటలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీపై విమర్శలు చేసే ముందు కాంగ్రెస్ మహిళా నాయకులు తమ పార్టీ గత చరిత్రను, మహిళల పట్ల వారు వ్యవహరించిన తీరును ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు.

**కాంగ్రెస్ హయాంలోనే అకృత్యాలు..**

ఒకప్పుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్, సొంత పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌ను ఉద్దేశించి ఓ భారీ బహిరంగ సభలో 'టంచ్ మాల్' అని వ్యాఖ్యానించినప్పుడు కాంగ్రెస్ పార్టీ మహిళల ఆత్మగౌరవం ఏమైందని మాధురి చంద్ర ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలపై అత్యధిక దాడులు, అత్యాచారాలు జరిగాయని, ఆ చిట్టా అంతా తమ వద్ద ఉందన్నారు. 1984 సిక్కుల ఊచకోత సమయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎంతమంది మహిళల ప్రాణాలు తీశారో, ఎంతమంది మానాలు దోచారో దేశ ప్రజలందరికీ తెలుసునని ఆరోపించారు. యూపీఏ పదేళ్ల పాలనలో (2004-2014) మహిళలపై అత్యాచార కేసులు 18,000 నుంచి ఏకంగా 36,000లకు పెరగడమే వారి వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

**మహిళా సాధికారత బీజేపీతోనే సాధ్యం..**

మహిళల పట్ల బీజేపీ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదని మాధురి స్పష్టం చేశారు. అవకాశం వచ్చిన ప్రతిసారీ బీజేపీ మహిళలకు అత్యున్నత పదవులు ఇచ్చి గౌరవించిందన్నారు. సుష్మా స్వరాజ్, రాజమాత సింధియా, ఆనందీబెన్ పటేల్, సుమిత్రా మహాజన్ నుంచి మొదలుకొని నేటి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వరకు ఎందరో మహిళలకు అవకాశాలు కల్పించిన ఘనత బీజేపీదేనని గుర్తుచేశారు.

**మహిళా బిల్లుపై దొంగాట..**

మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబించిందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ ఎలాంటి షరతులు లేకుండా మద్దతు తెలిపిందని, లోక్‌సభలోనూ ప్రవేశపెడితే మద్దతిస్తామని స్పష్టంగా చెప్పినా కాంగ్రెస్ వెనక్కి తగ్గిందని విమర్శించారు. అవకాశం ఉన్నా బిల్లును ఎందుకు ఆపేశారో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. కేవలం అధిష్ఠానం మెప్పు కోసం బీజేపీపై విమర్శలు చేయడం మాని, సొంత పార్టీ నేతలను నిలదీయాలని కాంగ్రెస్ మహిళా నేతలకు సూచించారు. మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్, మాజీ స్పీకర్ మీరాకుమార్ లాంటి వారు సైతం కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టారని గుర్తుచేశారు. మహిళల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే, చట్టసభల్లో మహిళా బిల్లును వ్యతిరేకించే నాయకుల ఇళ్ల ముందు బీజేపీతో కలిసి ధర్నాలకు కాంగ్రెస్ నాయకులు ముందుకు రావాలని ఆమె సవాల్ విసిరారు.



# సిద్ధిరాములు మృతి పార్టీకి తీరని లోటు

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి
- రఘునాథపురంలో మృతుడి కుటుంబానికి పరామర్శ

**తొలివెలుగు, రాజాపేట :** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, రఘునాథపురం గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం సిద్ధిరాములు మృతి పార్టీకి తీరని లోటని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి అన్నారు. ఇటీవల మరణించిన సిద్ధిరాములు పార్థివదేహాన్ని గురువారం ఆమె రఘునాథపురంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్ధిరాములు పార్టీ బలోపేతానికి, గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. నియోజకవర్గంలో నమ్మకమైన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాదె కవితకు జగదీశ్‌రెడ్డి శుభాకాంక్షలు

- హైదరాబాద్‌లో మాజీ మంత్రిని కలిసిన రాష్ట్ర నాయకురాలు
- మహిళలకు బిఆర్ఎస్ పెద్దపీట: జగదీశ్‌రెడ్డి



**తొలివెలుగు, హైదరాబాద్/యాదాద్రిభువనగిరి:** బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు గాదె కవిత నరేందర్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి ఆమెకు బొకే అందజేసి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే కేసీఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కవితకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు లభిస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కవితకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# బాసాని మంజులకు ఓయూ డాక్టరేట్

- రఘునాథపురం గ్రామంలో హర్షాతిరేకాలు
- విద్యావిలువలు-పాత్ర అంశంపై పరిశోధన



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన బాసాని మంజుల ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఫిలాసఫీ (తత్వశాస్త్రం) విభాగంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గురువారం ఓయూ అధికారులు ఆమెకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేశారు. ఓయూ ఫిలాసఫీ విభాగం అధ్యాపకులు డాక్టర్ వంశీధర్ పర్యవేక్షణలో మంజుల.. "నేటి విద్యా వ్యవస్థ, విద్యార్థులలో విలువలు పెంపొందించడంలో దాని పాత్ర" అనే సామాజికాంశంపై లోతైన పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. చౌటుప్పల్ ఎస్ఐ కృష్ణ మాల్ సతీమణి అయిన మంజుల, ఉన్నత విద్యలో రాణించి డాక్టరేట్ సాధించడం పట్ల రఘునాథపురం గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. బాసాని మంజులను గ్రామ ప్రముఖులు, అధ్యాపకులు, పలువురు జర్నలిస్టులు, బంధుమిత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

# గుండు అనసూర్య కుటుంబానికి అశోక్ గౌడ్ పరామర్శ

- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన నేతలు



**తొలివెలుగు, రాజాపేట :** బిజెపి రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం అత్తమ్మ, రాజాపేటకు చెందిన గుండు అనసూర్య ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ లు హైదరాబాద్‌లోని వారి స్వగృహానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనసూర్య కుమారుడు గుండు రాజును, ఇతర కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనసూర్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అటవీ ఆంక్షలు.. ఇందిరమ్మ ఇళ్లకు అవరోధాలు!

- జన్నారంలో ఇసుక దొరకక నిలిచిన నిర్మాణాలు
- పనులు పూర్తయితేనే బిల్లులంటున్న సర్కారు
- త్రిసభ్య శాఖల సమన్వయం కరువు
- జన్నారంలో పోలీసు, అటవీ, రెవెన్యూ అధికారుల తీరుపై పెదవి విరుపు
- సమన్వయం చేసుకోవాలని అధికారులకు పేదల విజ్ఞప్తి



**తొలివెలుగు, జన్నారం :** సొంతిల్లు కట్టుకోవాలన్న పేదల కలకు ఇసుక కొరత అడ్డంకిగా మారింది. జన్నారం మండలంలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో అటవీ శాఖ విధించిన కఠిన ఆంక్షలు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తీవ్ర శాపంగా పరిణమించాయి. ఇళ్ల నిర్మాణాలకు అత్యంత కీలకమైన ఇసుక లభించకపోవడంతో పనులన్నీ ఎక్కడికక్కడే అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పనులు త్వరగా పూర్తి చేసిన వారికే బిల్లులు మంజూరు చేస్తామని చెబుతుండటంతో పేదలకు పాలుపోని పరిస్థితి నెలకొంది. ఓ వైపు ఇసుక దొరకక పనులు ముందుకు సాగకపోవడం, మరోవైపు బిల్లులు ఆగిపోతాయన్న భయంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సమన్వయ లోపంతో వ్యవహరించకుండా, వెంటనే స్పందించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరా సజావుగా సాగేలా చూడాలని పేదలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# వేడుకల్లో సందడి.. వధూవరులకు ఎమ్మెల్యే ఆశీస్సులు



- పలు శుభకార్యక్రమాలకు హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం



**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ, నిశ్చితార్థ వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం పాల్గొని సందడి చేశారు. గురువారం మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సిలివేరు సత్తయ్య కుమారుడి వివాహ వేడుకకు ఆయన హాజరయ్యారు. నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లక్ష్మాపురం గ్రామానికి చెందిన బత్తుల కృష్ణ కుమార్తె వివాహ నిశ్చితార్థ వేడుకలో పాల్గొని కాబోయే వధూవరులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి మల్లారెడ్డి, రామన్నపేట మాజీ సర్పంచ్ గరిక సత్యనారాయణ, జిల్లా నాయకులు గంగుల రాజిరెడ్డి, గుత్త నర్సిరెడ్డి, నంద్యాల భిక్షం రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే హాజరుకావడంతో ఆయా కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు సింగిరెడ్డి మల్లారెడ్డి, రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ, జిల్లా నాయకులు గంగుల రాజిరెడ్డి, గుత్త నర్సిరెడ్డి, నంద్యాల భిక్షం రెడ్డి, జినుకల ప్రభాకర్, పున్న జగన్మోహన్, శంభాలా వెంకన్న, రాయిని రమేష్, గోదాసు పృథ్వి, సాల్వేరు అశోక్, సాల్వేరు లింగం తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- మునిపంపుల సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం






**తొలివెలుగు, రామన్నపేట :** గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతులుగా తయారవుతారని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం పేర్కొన్నారు. మండల పరిధిలోని మునిపంపుల అంగన్‌వాడీ క్లస్టర్ ఆధ్వర్యంలో గురువారం 'పోషణ పక్వాడ దివాస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్, ఆరోగ్య శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోషకాహారం అంటే ఖరీదైనది కాదని, స్థానికంగా లభించే పప్పు ధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలను సరైన మోతాదులో తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించకుండా, పరిశుభ్రత పాటించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శనను ఆయన తిలకించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రచ్చ వేణు, ఉపసర్పంచ్ తాళ్ల క్రాంతి కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు బద్రుని సాబేగం, బాదె మంజుల, యాదాసు శోభ, ఏలూరు అనిత, ఆశా కార్యకర్తలు లక్ష్మి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

- దాసిరెడ్డిగూడెంలో కన్వెన్షన్ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం



**తొలివెలుగు, వలిగొండ :** గ్రామీణ ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కూడిన భవనాలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన 'జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్'ను గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా పల్లెల్లోనూ పట్టణ స్థాయి వసతులు పెరగడం అభివృద్ధికి సంకేతమన్నారు. శుభకార్యాలు, సామాజిక వేడుకలు నిర్వహించుకోవడానికి ఈ కన్వెన్షన్ హాల్ స్థానికులకు ఎంతో వెసులుబాటు కలిగిస్తుందని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇలాంటి సంస్థల ఏర్పాటు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు





- మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు
- సెక్టార్ సూపర్వైజర్ వాణిశ్రీ

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** యువత చెడు వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్వైజర్ జి. వాణిశ్రీ హితవు పలికారు. మండల కేంద్రంలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ మాసం' కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్, జిల్లా డి-అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి కాలంలో యువత సిగరెట్లు, మద్యం, గుట్కా, గంజాయి వంటి ప్రాణాంతక వ్యసనాలకు అలవాటు పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాల్లో ఎవరైనా ఇలాంటి వ్యసనాలకు లోనైతే వెంటనే డి-అడిక్షన్ విభాగానికి సమాచారం అందించి వారిని సాధారణ స్థితికి తీసుకురావాలని కోరారు. ఆత్మకూరు(ఎం) సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో యువత అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, డీ-అడిక్షన్ ఆర్గనైజర్లు శ్రీనివాస్, ఉపేందర్, శ్రీశైలం, అంగన్వాడి సిబ్బంది, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడికి అండగా 'ముఖ్యమంత్రి సహాయనిధి'

- సోమయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత
- మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని, కౌన్సిలర్ రాధిక



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన వల్లందాస్ సోమయ్యకు మంజూరైన రూ. 32,000 చెక్కును గురువారం కౌన్సిలర్ సూరపల్లి రాధిక రమేష్‌తో కలిసి ఆమె బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడేవారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ శ్రేణుల పాలాభిషేకం
- రామన్నపేటలో ఘనంగా సంబరాలు, స్వీట్ల పంపిణీ


**తొలివెలుగు, రామన్నపేట :** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, బాణాసంచా కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ.. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్, హరీష్ రావులపై కమిషన్ పేరుతో తప్పుడు విచారణలకు పూనుకుందని ధ్వజమెత్తారు. హైకోర్టు తీర్పుతో నిజం నిలకడ మీద తెలుస్తుందని నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, పల్లివాడ ఎల్లంకి సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, ఇడం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం, ఎండి ఆమీర్, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, బద్దుల రమేష్, ఎస్కే చాంద్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న, నాయకులు బొడ్డు అల్లయ్య, పిట్టె కృష్ణారెడ్డి, జెట్టి సైదులు, జాల అమరేందర్ రెడ్డి, బొలుగుల కృష్ణ, నల్ల సైదులు, బొడ్డుపల్లి రాజు, ఆవుల శ్రీధర్, కూనూరు లింగస్వామి, అంతటి మల్లేశం, ఎండి మోసబ్, శివరాత్రి కుమార్, గాదె లక్ష్మయ్య, ఆవుల సత్తయ్య, కడారి శివ, వరకల మల్లేశం, పావిరాల నరసింహ, కర్రె శీను, పండుగ వెంకన్న, మెడబోయిన నరేష్, పోషబోయిన నాగరాజు, కోసని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక మహాసభలను విజయవంతం చేయాలి

- ప్రచార కరపత్రాల ఆవిష్కరణ
- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా

**తొలివెలుగు, రామన్నపేట:** వచ్చే నెల 18, 19 తేదీల్లో రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా కోరారు. గురువారం మండల కేంద్రంలోని కూలీవాడలో మహాసభల ప్రచార కరపత్రాలను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ.. భూమిలేని పేదలకు భూపంపిణీ, కూలీ రేట్ల పెంపు, కుల వివక్ష నిర్మూలన లక్ష్యంగా పుచ్చలపల్లి సుందరయ్య 1936లో ఈ సంఘాన్ని స్థాపించారని గుర్తు చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని గ్రామాల్లో సమ్మెలు నిర్వహించడంలో సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. ఉపాధి హామీ చట్టం సాధనలో వామపక్షాల పోరాటం మరువలేనిదని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు జెల్లెల పెంటయ్య మాట్లాడుతూ.. మహాసభల సందర్భంగా గ్రామాల వారీగా జాతాలు నిర్వహిస్తామని, మే 18న జరిగే బహిరంగ సభకు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర నేత ఆర్.వెంకట్రాములు, ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జహంగీర్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మేడి ముకుందం, కార్యదర్శి కందుల హనుమంతు, సీఐటీయూ మండల కార్యదర్శి గొరిగె సోములు, నాయకులు గాదె నరేందర్, మేడి అంజమ్మ, మమత, చంద్రమ్మ, రాములమ్మ, గాదె పద్మ, గోర్ల అండాలు, జాన్సీ, బందెల ముత్యాలి, గట్టు అనిత తదితరులు పాల్గొన్నారు.



## అందుబాటు ధరల్లో శుభకార్యాలకు వేదిక

- దాసిరెడ్డిగూడెం సమీపంలో జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభం
- హాజరైన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

**తొలివెలుగు, వలిగొండ :** సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో, అత్యాధునిక వసతులతో కూడిన వేదికలు అందుబాటులోకి రావడం అభినందనీయమని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. దాస్యవలిగొండ మండలం దాసిరెడ్డిగూడెం – రెడ్ల రేపాక గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన 'జి ఎస్ ఆర్ ఏసీ కన్వెన్షన్ హాల్'ను గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఇంటి శుభకార్యాలను పట్టణాలకు వెళ్లకుండా, ఇక్కడే తక్కువ ఖర్చుతో ఘనంగా నిర్వహించుకునేందుకు ఈ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నిర్వాహకులు కందడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని, సకల సౌకర్యాలతో ఈ కన్వెన్షన్ హాల్‌ను నిర్మించినట్లు చెప్పారు. వివాహాలు, నిశ్చితార్థాలు, పుట్టినరోజు వేడుకలకు తగిన విధంగా విశాలమైన హాల్, పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి, డా. ర్యాకల శ్రీనివాస్, జనగాం పాండు, రాపోలు గోపి, కొమురెల్లి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భీమనపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా లింగస్వామి


- ఏకగ్రీవంగా గ్రామ కమిటీ ఎన్నిక
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** మండలంలోని భీమనపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా సింగం లింగస్వామిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు అనిరెడ్డి జగన్ రెడ్డి సమక్షంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కమిటీ వివరాలను వెల్లడించారు. గ్రామ శాఖ ఉపాధ్యక్షుడిగా గోని కుమార్, యూత్ అధ్యక్షుడిగా సింగం నరేష్, యూత్ ఉపాధ్యక్షుడిగా కానాపురం ప్రమోద్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాక మల్లేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. క్రమశిక్షణతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాట కైలాసం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మర్రి రాజిరెడ్డి, నాయకులు కంటే లింగస్వామి యాదవ్, దేవరకొండ శ్రీకాంత్ చారి, ఉప్పునూతల శ్రీశైలం, రమణమ్మ, బురుగు సంతోష్, కవిత, కలకొండ రమేష్, కప్పల ఆంజనేయులు, యూత్ నాయకులు కొండమోని నరసింహా, కప్పల రాజు, మేకల కృష్ణ, శ్రీకాంత్, నవీన్, రవి, శేఖర్, కొండమోని కృష్ణ, శ్రీశైలం, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్‌పేట్ గురుకులంలో జడ్పీ సీఈఓ తనిఖీ

- ప్రతిభావంతులకు బహుమతుల పంపిణీ
- ఉత్సాహంగా సంక్షేమ వారోత్సవాలు
- జడ్పీ సీఈఓ శోభారాణి




**తొలివెలుగు, చౌటుప్పల్ :** విద్యార్థులు లక్ష్యశుద్ధితో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) శోభారాణి ఆకాంక్షించారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' (99 రోజుల యాక్షన్ ప్లాన్) సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆమె తూప్రాన్‌పేట్ లోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, విద్యాబోధన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆమె అభినందనలు తెలియజేస్తూ బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందుతోందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, చౌటుప్పల్ ఎంపీడీవో బి. సందీప్ కుమార్, పర్యవేక్షకులు బి. విజయకుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం
- దళారులను నమ్మి మోసపోవద్దు.. ప్రభుత్వ కేంద్రాల్లోనే అమ్ముకోవాలి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరాయంగా కృషి చేస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం, శివరెడ్డిగూడెం, జూలూరు గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతి సామాన్యుడికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పిదాల వల్ల నేడు రాష్ట్ర ప్రజలు ఆర్థిక భారాన్ని మోస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే కేటీఆర్, హరీష్ రావు అసత్య ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నెల రోజుల్లోనే ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ గిట్టుబాటు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భువనగిరి ఏఎంసీ మార్కెట్ చైర్మన్ రేఖ బాబురావు, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల, పట్టణ శాఖ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, భారత లవ కుమార్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మరి నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు కొండమడుగు ఎల్ల స్వామి, రావుల జంగయ్య, సర్పంచ్ కాసుల అంజయ్య, బొక్క మల్లారెడ్డి, మాజీ పిఏసిఎస్ చైర్మన్ ఫకీరు మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, జిల్లా నాయకులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మధ్య అంజిరెడ్డి, కుక్క దానయ్య, సురవి వెంకటేష్ గౌడ్, నాయకులు వారాల రామచంద్రారెడ్డి, బందారు ప్రకాష్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కేసారం శ్రీకాంత్ రెడ్డి, కేసారం సురేందర్ రెడ్డి, మహేష్, పాలకూర ఉపేందర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

- జలాల్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- దళారులను ఆశ్రయించి మోసపోవద్దు..
- గ్రామ సర్పంచ్ శాపాక లింగస్వామి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని అన్ని విధాలా ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాపాక లింగస్వామి, ఉప సర్పంచ్ కేసారం మధుసూదన్ రెడ్డి, గ్రామ పాలకవర్గ సభ్యులు, వ్యవసాయ అధికారులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



## ఆత్మగౌరవానికి ప్రతీక.. ఇందిరమ్మ ఇల్లు

- లబ్ధిదారుల ఇంట సంబరం..
- గృహ ప్రవేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్
- సొంతింటి కల నెరవేరిన వేళ..



**తొలివెలుగు, చౌటుప్పల్ :** ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఎనం బాలరాజు దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని భరోసా ఇచ్చారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు దేప రమ్య రాజు, పిల్లలమర్రి శ్రీనివాస్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## సృజనాత్మకతకు పదును పెట్టాలి

- అల్లాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ కిట్లు పంపిణీ
- ఉత్సాహంగా 'బడిబాట'.. పాల్గొన్న సర్పంచ్ టేకుల మంజుల

**తొలివెలుగు, చౌటుప్పల్ :** విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మక రంగాల్లోనూ రాణించాలని అల్లాపురం గ్రామ సర్పంచ్ మంజుల కోరారు. గురువారం అల్లాపురం ప్రాథమిక పాఠశాల చివరి పనిదినం సందర్భంగా విద్యార్థులకు ప్రగతి పత్రాల (సర్టిఫికెట్స్) పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా బొమ్మలు వేయడం వంటి కళలపై దృష్టి సారించాలని సూచిస్తూ, వారికి సొంత ఖర్చుతో డ్రాయింగ్ కిట్లను అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి 'బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరించి, బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సర్పంచ్ కోరారు. సెలవుల్లో విద్యార్థులు ప్రాణాపాయం లేని విధంగా జాగ్రత్తలు తీసుకుంటూ స్విమ్మింగ్ (ఈత) నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## మహిళా ఆర్మీ డిగ్రీ కాలేజీ ప్రవేశాలకు నోటిఫికేషన్

- ఈ నెల 30 వరకు దరఖాస్తుకు అవకాశం
- దేశ్‌ముఖ్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ కళాశాల ప్రకటన

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా ఆర్మీ డిగ్రీ కాలేజీలో 2026 – 27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. ఈ ఏడాది సీనియర్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసిన మహిళా అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోగా నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**అర్హతలు - ఎంపిక విధానం:**

ప్రవేశానికి అభ్యర్థులు ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. కనీస ఎత్తు 152 సెంటీమీటర్లు ఉండాలని, బరువు 43 కిలోల నుండి 58 కిలోల మధ్య ఉండాలని పేర్కొన్నారు. మే 1 నుండి 6వ తేదీ వరకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇందులో దేహదారుఢ్య పరీక్షలు, రాత పరీక్ష, వైద్య పరీక్షలు, ఇంటర్వ్యూ ఉంటాయి. మెరిట్ ఆధారంగా తుది ఎంపిక జాబితాను ప్రకటిస్తారు. పూర్తి వివరాల కోసం 8184813121, 7995010687 నంబర్లను సంప్రదించాలని కోరారు.



# సిరీస్ బంగ్లా వశం.. మూడో వన్డేలో కివీస్ ఓటమి

ఛత్తోగ్రమ్ : సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-1తో దక్కించుకుంది. తొలి వన్డేలో ఓడినప్పటికీ రెండో మ్యాచ్‌లో పుంజుకున్న ఆ జట్టు.. గురువారం సిరీస్ విజేతను నిర్ణయించేందుకు జరిగిన మూడో పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటి 55 రన్స్ తేడాతో ప్రత్యర్థిని చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేస్తూ నజ్ముల్ హొసేన్ శాంతో (105) శతకానికి తోడు లిటన్ దాస్ (76) రాణించడంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 265 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో 24 ఓవర్లకు 107/3తో మెరుగ్గానే కనిపించిన కివీస్.. ముస్తాఫిజుర్ (5/43) పేస్‌కు కుదేలై 44.5 ఓవర్లలో 210 పరుగులకే కుప్పకూలింది. డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ (75), నిక్ కెల్లీ (59) పోరాటం సరిపోలేదు.

# స్టార్క్ వస్తున్నాడు!



సిడ్నీ: ఈ సీజన్‌లో పడుతూ లేస్తూ సాగుతున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు శుభవార్త. భుజం, మోచేయి గాయం కారణంగా సీజన్‌లో ఆరు మ్యాచ్‌లకు దూరమైన ఆ జట్టు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ త్వరలోనే టీమ్‌తో కలువనున్నాడు. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కూడా స్టార్క్ ఐపీఎల్‌లో ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఆస్ట్రేలియా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నిరుడు యాషెస్ టెస్టు అనంతరం బిగ్ బాష్ లీగ్‌లో ఆడిన స్టార్క్.. గాయం కారణంగా ఇన్నాళ్లు పునరావాసం పొందాడు. ఇటీవలే అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించిన నేపథ్యంలో సీఏ నుంచి స్టార్క్‌కు లైన్ క్లీయర్ అయింది.

# 'అహం' వదిలి మైదానానికి వస్తా!



లక్నో: భారత క్రికెటర్, రాజస్తాన్ రాయల్స్ ఆటగాడు రవీంద్ర జడేజా సుదీర్ఘ కాలం తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లో ప్రభావవంతమైన ప్రదర్శన కనబర్చాడు. అటు బ్యాటింగ్‌లో మెరుగైన స్కోరు సాధించిన అతను, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లక్నో సూపర్ జెయింట్స్‌ను నిలువరించి రాజస్తాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే గత కొన్ని మ్యాచ్‌లలో జడేజా బౌలర్‌గా తన పూర్తి స్థాయి నాలుగు ఓవర్ల కోటా కూడా వేయలేదు. దీనిపై అతను స్పందించాడు. జట్టు కోణంలోనే అంతా ఆలోచించాలని, ఏ రూపంలోనైనా టీమ్‌కు ఉపయోగపడటమే తన పని అని అతను వ్యాఖ్యానించాడు. 'నేను మైదానానికి వస్తున్నప్పుడే నా అహాన్ని హోటల్ రూంలో వదిలి బయలుదేరతాను. ఆ రోజు టీమ్‌కు ఎలా ఉపయోగపడగలనో అని మాత్రమే ఆలోచిస్తాను తప్ప మిగతా విషయాలు కాదు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ విషయానికి వస్తే చివరి వరకు నిలబడాలని పట్టుదలగా నిర్ణయించుకున్నా. ఎందుకంటే 17 లేదా 18వ ఓవర్లో అవుటైపోతే మేం 159 వరకు చేరేవాళ్లం కాదు. కనీసం 2025 పరుగులు తగ్గేవి. అప్పుడు ఆ లక్ష్యాన్ని ఛేదించడం లక్నోకు సులువయ్యేది. టి20 మ్యాచ్‌లలో ప్రతీ పిచ్, పరిస్థితులు భిన్నంగా ఉండాయి కాబట్టి దానికి తగినట్లుగా ఆడాలి. బౌలింగ్‌లో ఫలానా ప్రత్యర్థి బ్యాటర్ నా బౌలింగ్‌ను సులువుగా ఆడతాడని జట్టు భావిస్తే అర్థం చేసుకోగలను. అది జరిగినా, జరగకపోయినా ఆటలో భాగంగానే భావిస్తాను' అని జడేజా చెప్పాడు. చివరి ఓవర్ మయాంక్ యాదవ్ వేస్తాడని ముందే ఊహించి దానికి తగినట్లుగా సిద్ధమయ్యానన్న జడేజా ఆ ఓవర్లో 20 పరుగులు రాబట్టడంలో సఫలమయ్యాడు. బౌలింగ్‌లో వేగాన్ని సమర్థంగా వాడుకునే మార్ష్, పూరన్‌లకు స్లో బంతులు వేసి కట్టడి చేయగలిగినట్లు జడేజా వివరించాడు.

# చౌటుప్పల్‌లో బీజేపీ త్రివిధ నిరసనలు, హర్షాతిరేకాలు



- అండర్ పాస్ మంజూరుపై హర్షం.. నితిన్ గడ్కరీ చిత్రపటానికి పాలాభిషేకం
- వలిగొండ రోడ్డు పనులపై నిరసన.. నల్లజెండాతో బైఠాయింపు
- ప్రధానిపై వ్యాఖ్యలకు నిరసనగా ఖర్గే దిష్టిబొమ్మ దహనం

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ కేంద్రంగా గురువారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక బస్ స్టేషన్ వద్ద అండర్ పాస్ నిర్మాణానికి కేంద్రం అనుమతులు మంజూరు చేయడంపై ఒకవైపు హర్షం వ్యక్తం చేస్తూనే, మరోవైపు నిలిచిపోయిన రోడ్డు పనులు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడి వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు మండిపడ్డారు. బస్టాండ్ వద్ద అండర్ పాస్ మంజూరుకు కృషి చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, బీజేపీ నేత గంగిడి మనోహర్ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ పోరాటం వల్లే అండర్ పాస్ సాధ్యమైందని, ఇప్పుడు క్రెడిట్ కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పాకులాడటం హాస్యాస్పదమని విమర్శించారు. అనంతరం, రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్న వలిగొండ - చౌటుప్పల్ రోడ్డు పనులను నిరసిస్తూ శంకుస్థాపన శిలాఫలకం వద్ద నల్లజెండాలు పాతి బైఠాయించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. చివరగా, ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయనపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణ, గోని శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు శాగ చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, నాయకులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఆలే చిరంజీవి, కైరంకొండ అశోక్, దిండు భాస్కర్, కౌన్సిలర్ బుడ్డ సురేష్, గుజ్జుల సురేందర్ రెడ్డి, సర్పంచ్ నందగిరి వెంకటేశం గౌడ్, ఊడుగు వెంకటేశం గౌడ్, పోలోజు శ్రీధర్ బాబు, కంది లక్ష్మారెడ్డి, ఉబ్బు బిక్షపతి, కడారి ఐలయ్య, పబ్బతి శేఖర్, గంట్ల బుచ్చిరెడ్డి, గుర్రం రవీందర్, తేలుకుంట్ల శ్రీధర్, రాధారపు సత్తయ్య, పోలపల్లి ముత్తయ్య, గోషిక నీరజ, హల్మాస్పేట గౌతమ్, గోషిక పురుషోత్తం, కంచర్ల వెంకటరెడ్డి, కాసోజు గోపి, గుండెబోయిన వేణు, వంగాల రమాకాంత్, కానుగు కొండల్, రాజపేట అశోక్, ఎల్లంకి పాండు, వరగంటి భాను, కానుగు శేఖర్, బత్తుల రాజశేఖర్, గుండెపల్లి వెంకటరెడ్డి, కాసోజు కనకాచారి, అంతటి నరేష్, పందుల శరత్, కొయ్యడ స్వామి, పోలోజు భాస్కరాచారి, గుండెబోయిన లింగస్వామి, బి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.







# ముంబైపై చెన్నై ఘనవిజయం

ముంబై : ఐపీఎల్‌లో ఐదుసార్లు చాంపియన్లు చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే), ముంబై ఇండియన్స్ మధ్య వాంఖడేలో గురువారం జరిగిన పోరులో సీఎస్‌కేనే విజయం వరించింది. క్రికెట్ అభిమానులు 'ఎల్‌క్లాసికో'గా పిలుచుకునే ఈ పోరును చెన్నై మొదట బ్యాట్‌తో తర్వాత బంతితో సత్తాచాటి పూర్తిగా ఏకపక్షంగా మార్చేసింది. సీఎస్‌కే నిర్దేశించిన 208 పరుగుల ఛేదనలో స్పిన్నర్లు అకీల్ హొసేన్ (4/17) నాలుగు వికెట్ల ప్రదర్శనకు తోడు నూర్ అహ్మద్ (2/23) స్పిన్ మాయాజాలానికి విలవిల్లాడిన ముంబై.. 19 ఓవర్లలో 104 పరుగులకు కుప్పకూలింది. దీంతో103 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన చెన్నై ఐదో స్థానానికి ఎగబాకగా, ముంబై ఐదో ఓటమితో ఎనిమిదో స్థానంలో ఉంది. తిలక్ వర్మ (37), సూర్యకుమార్ (36) మినహా మిగిలినవారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. మొదట టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు వచ్చిన చెన్నై.. శాంసన్ (54 బంతుల్లో 101 నాటౌట్, 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) శతకంతో కదం తొక్కడంతో నిర్ణీత ఓవర్లకు 6 వికెట్లు నష్టపోయి 207 పరుగులు చేసింది. ఘజన్‌ఫర్ (2/25), అశ్వని (2/37) చెరో రెండు వికెట్లు తీశారు.

### స్పిన్ ఉచ్చులో చిక్కుకుని..

11/3. భారీ ఛేదనలో 3 ఓవర్లకు ముంబై స్కోరది. తొలి ఓవర్లోనే అకీల్.. డానిష్‌ను ఔట్ చేసి వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టగా రెండో ఓవర్లో ముకేశ్.. ప్రమాదకర డికాక్ (7)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. తన రెండో ఓవర్లో అకీల్.. నమన్‌నూ డకౌట్ చేయడంతో ముంబై ఆత్మరక్షణలో పడింది. అప్పట్నుంచి ఆ జట్టు లక్ష్యం దిశగా అడుగులు వేయలేకపోయింది. పవర్ ప్లేలో సూర్య, తిలక్ క్రీజులో ఉన్నా ఆ జట్టు చేసింది 29 పరుగులే. సుమారు 9 ఓవర్ల పాటు క్రీజులో ఉన్న వీరిద్దరూ పెద్దగా బ్యాట్ ఝుళిపించలేకపోవడంతో సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిపోయింది. అకీల్ తన రెండో స్పెల్‌కు బౌలింగ్‌కు వచ్చి ముంబై ఓటమిని ఖరారు చేశాడు. అతడు విసిరిన 11వ ఓవర్లో ఐదో బంతికి తిలక్‌ను బోల్తా కొట్టించి 73 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి ముగింపు పలికాడు. నూర్ 13వ ఓవర్ వరుస బంతుల్లో హార్దిక్ (1), రూథర్‌ఫర్డ్‌ను వెనక్కిపంపాడు. అకీల్ తన ఆఖరి ఓవర్లో సూర్యను కూడా ఔట్ చేయడంతో చెన్నై విజయం ఖాయమైంది. ఆ తర్వాత ముంబై బ్యాటర్ల పోరాటం ఆ జట్టు స్కోరుబోర్డును వంద పరుగుల మార్కును దాటించడం కోసమే సాగింది.

### చేట సూపర్ ఇన్నింగ్స్

ఈ సీజన్‌కు ముందు భారీ అంచనాలతో చెన్నైకి ట్రేడ్ అయి తొలి మూడు మ్యాచ్‌లలో విఫలమైనా తర్వాత దుమ్మురేపుతున్న చేట (శాంసన్).. ముంబైతో మ్యాచ్‌లోనూ కదం తొక్కి ఈ సీజన్‌లో రెండో శతకం బాదాడు. మిగిలిన బ్యాటర్లలో ఎవరూ 25 పరుగుల మార్కును దాటకపోయినా సంజూకు అండగా నిలిచి సీఎస్‌కే భారీ స్కోరు చేయడంలో అతడికి తోడ్పాటు అందించారు. మూడు బౌండరీలు, ఓ సిక్స్‌తో జోరు మీద కనిపించిన కెప్టెన్ రుతురాజ్ (22)ను ఘజన్‌ఫర్ మూడో ఓవర్లోనే వెనక్కి పంపినా పవర్ ప్లేలో సంజూ జోరుకు ముంబై అడ్డుకట్ట వేయలేకపోయింది. హార్దిక్ 4వ ఓవర్లో 4, 6, 4, 4 రాబట్టిన అతడు.. బుమ్రా ఓవర్లోనూ కళ్లుచెదిరే సిక్స్‌తో అలరించాడు. మూడు బౌండరీలతో ఊపు మీద ఉన్న సర్ఫరాజ్ (14)ను పవర్ ప్లే ఆఖరి ఓవర్లో శాంట్నర్ క్లీన్‌బౌల్డ్ చేయడంతో సీఎస్‌కే రెండో వికెట్ కోల్పోయింది. దూబే (5) సైతం నిరాశపరిచినా చెన్నై భారీ ఆశలు పెట్టుకున్న బ్రెవిస్ (11 బంతుల్లో 21, 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. అశ్వని 11వ ఓవర్లో బౌండరీతో ఫిఫ్టీ పూర్తిచేసిన సంజూ.. కార్తీక్ (18) అండతో స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. కార్తీక్‌ను బుమ్రా, ఓవర్టన్ (15)ను అశ్వని ఔట్ చేయడంతో సీఎస్‌కే 200 మార్కును అందుకుంటుందా? అని అనిపించింది. కానీ క్రిష్ చివరి ఓవర్లో తొలి బంతికే సిక్స్ బాది 90లలోకి వచ్చిన చేట.. నాలుగో బంతికి మరో సిక్స్, లాస్ట్ బాల్‌కు ఫోర్ కొట్టి ఈ సీజన్‌లో రెండో శతకాన్ని నమోదు చేశాడు.

### సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 20 ఓవర్లకు 207/6 (శాంసన్ 101బి, గైక్వాడ్ 22, ఘజన్‌ఫర్ 2/25, అశ్వని 2/37);

ముంబై: 19 ఓవర్లకు 104 ఆలౌట్ (తిలక్ 37, సూర్య 35, అకీల్ 4/17, నూర్ 2/23)